క్లుప్తంగా

జిల్లా సలహా మండలి సభ్యుడిగా పోసికుమార్



ధవళేశ్వరం: దివ్యాంగుల హక్కుల పరిరక్షణ జిల్లా సలహా మండలి సభ్యుడిగా ముత్యాల పోసికుమార్ నియమితులయ్యారు. దివ్యాంగుల చట్టం 2016 ప్రకారం కలెక్టర్ కె.మాధవీలత ఈయనను నియమించారు. ముత్యాల పోసికుమార్ ప్రస్తుతం దివ్యాంగుల విభాగం వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడిగా బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. అలాగే స్ఫూర్తి చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్‌గా, ఏడీఆర్ఎఫ్ జాతీయ కార్యదర్శిగా సేవలందిస్తున్నారు. ఈ సందర్భంగా పోసికుమార్ మాట్లాడుతూ తనపై నమ్మకంతో జిల్లా సలహా మండలి సభ్యుడిగా నియమించిన కలెక్టర్ కె.మాధవీలతకు కృతజ్ఞతలు తెలిపారు.

విభూతి బాబూరావు సేవలు చిరస్మరణీయం



విభూతి బాబూరావు విగ్రహానికి నమస్కరిస్తున్న ఎమ్మెల్యే బుచ్చయ్య చౌదరి

రాజమహేంద్రవరం రూరల్: బుర్రకథల ద్వారా ప్రజలను చైతన్యపరిచిన జానపద కళాకారుడు, బుర్రకథ సామ్రాట్ విభూతి బాబూరావు సేవలు చిరస్మరణీయమని ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరి అన్నారు. శాటిలైట్ సిటీ గ్రామంలో ఇటీవల ఆవిష్కరించిన విభూతి బాబూరావు విగ్రహానికి ఆదివారం ఆయన పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా గోరంట్లను విభూతి బ్రదర్ లోవరాజు సత్కరించారు.

సురేష్ మరణం తీరని లోటు



సురేష్ చిత్రపటానికి పుష్పాంజలి ఘటిస్తున్న అసోసియేషన్ సభ్యులు

ధవళేశ్వరం: ఫొటో, వీడియో గ్రాఫర్స్ అసోసియేషన్ జిల్లా కార్యవర్గ సభ్యుడు పర్వతనేని సురేష్ మృతి తీరని లోటని అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు కొని శ్రీనివాస్ పేర్కొన్నారు. ఆదివారం ధవళేశ్వరం కాటన్ పేటలో జరిగిన సంతాప సభలో అసోసియేషన్ తరఫున నివాళులర్పించారు. ఈ సందర్భంగా సురేష్ అందించిన సేవలను పలువురు కొనియాడారు. కార్యక్రమంలో రావు, ఫణికుమార్, తాడిపత్రి చిన్ని, లక్ష్మీనారాయణ చౌదరి, ఎస్.శేఖర్ పాల్గొన్నారు.

టెక్నికల్ ఆఫీసర్లకు గెజిటెడ్ హోదా కల్పించాలి



సమావేశంలో ప్రసంగిస్తున్న నూతన కార్యదర్శి శ్రీనివాస్

రాజమహేంద్రవరం రూరల్: టెక్నికల్ ఆఫీసర్లకు గెజిటెడ్ హోదా కల్పించాలని ఆంధ్రప్రదేశ్ టెక్నికల్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎస్‌వీ సూర్యనారాయణరాజు, కార్యదర్శి ఎస్ఎల్ సోమయాజులు, కన్వీనర్ ఎం.ఏడుకొండలు విజ్ఞప్తి చేశారు. ఆ అసోసియేషన్ రాష్ట్ర ఎగ్జిక్యూటివ్ కమిటీ సమావేశాన్ని బొమ్మూరు నరసింహరాజు కల్యాణ మండపంలో ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అన్ని ఇంజినీరింగ్ విభాగాల్లో ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేయాలన్నారు. ఆర్‌పీఎస్ 2018 సిఫారసు ప్రకారం టెక్నికల్ అసిస్టెంట్‌గా కారుణ్య నియామకాలను పునరుద్ధరించాలని కోరారు. తమ న్యాయపరమైన డిమాండ్లను ముఖ్యమంత్రి వైఎస్ జగన్ దృష్టికి త్వరలో తీసుకువెళతామన్నారు. అనంతరం జిల్లా అధ్యక్షుడిగా జి.వెంకటేశ్వరరావు, కార్యదర్శిగా ఎం.శ్రీనివాస్‌ను ఎన్నుకున్నారు.



ధవళేశ్వరంలోని కాటన్ బ్యారేజీ వద్ద గోదావరి ప్రవాహం



ధవళేశ్వరంలోని కాటన్ బ్యారేజీ వద్ద 16 అడుగుల నీటిమట్టం



మూడో రైలు వంతెన వద్ద ఉధృతంగా ప్రవహిస్తున్న గోదావరి

శాంతించని గోదారమ్మ

- ఉధృతంగా ప్రవాహం
- అధికారుల అప్రమత్తం
- బాధితులకు అన్ని వసతులు

రాజమహేంద్రవరం సిటీ/రూరల్: గోదారమ్మ వరద నీటితో ఉప్పొంగుతోంది. ఉధృతంగా ప్రవహిస్తూ ప్రజలను బెంబేలెత్తిస్తోంది. వరద నేపథ్యంలో అధికార యంత్రాంగం అప్రమత్తమైంది. గోదావరి ఘాట్లలో సందర్శకులకు నిషేధం విధించింది. ఆయా ఘాట్ల వద్ద సిబ్బందిని నియమించింది. అలాగే పునరావాస కేంద్రంలోని వరద బాధితులకు అవసరమైన సహాయక చర్యలు పూర్తి స్థాయిలో చేపడుతున్నట్లు నగర పాలక సంస్థ కమిషనర్ దినేష్ కుమార్ తెలిపారు. గోదావరి వరదతో ముంపునకు గురైన కేతావారిలంక, బ్రిడ్జిలంక, పాత బ్రిడ్జిలంక, వెదురులంక, గోదావరి గట్టు కింద నివాసముంటున్న 107 కుటుంబాలను ఆల్కాట్‌తోట నగర పాలక సంస్థ కల్యాణ మండపంలోని పునరావాస కేంద్రానికి తరలించామన్నారు. వీరిలో 125 మంది పురుషులు, 125 మంది మహిళలు, 56 మంది బాలబాలికలు ఉన్నారన్నారు. వీరికి ఏవిధమైన ఇబ్బంది లేకుండా ఉదయం అల్పాహారం, మధ్యాహ్నం భోజనం, సాయంత్రం టీ, స్నాక్స్, రాత్రి భోజనం ఏర్పాటు చేస్తున్నామన్నారు. వైద్య సేవలు అందించేందుకు ప్రత్యేక శిబిరం ఏర్పాటు చేశామన్నారు.



పునరావాస కేంద్రంలో వరద బాధితులకు భోజనం పంపిణీ



హేవలాక్ బ్రిడ్జి వద్ద ఉధృతంగా..

మణిపూర్ ఘటనలకు నిరసనగా ర్యాలీ



రాజవోలులో మాట్లాడుతున్న రెవరెండ్ టాటావిక్టర్



ధవళేశ్వరంలో ర్యాలీ చేస్తున్న క్రైస్తవులు

రాజమహేంద్రవరం రూరల్: మణిపూర్ రాష్ట్రంలో మహిళలపై జరుగుతున్న అత్యాచారాలు, క్రైస్తవులపై దాడులు, అరాచకాలకు నిరసనగా రాజవోలులోని క్రీస్తుకృపా సంఘం ఆధ్వర్యంలో ఆదివారం శాంతిర్యాలీ నిర్వహించారు. సంఘ కాపరి టాటావిక్టర్ పెనుమాక, సంఘ సభ్యులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ ఘటనలకు కారకులకు కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు.

- హుకుంపేట డిబ్లాకులో షారోన్ గాస్పెల్ మినిస్ట్రీస్ బిషప్ సీహెచ్ సైమన్ పీటర్ ఆధ్వర్యంలో ఐక్య క్రైస్తవుల శాంతిర్యాలీ నిర్వహించారు. రత్నం, సతీష్, మోజెస్, లూథియా పాల్గొన్నారు.
- ధవళేశ్వరం: గ్రామంలోని ఎస్ఎంఈ లూథరన్ చర్చి పాస్టర్ అనిల్ కిరణ్, సంఘ పెద్దల ఆధ్వర్యంలో ఆ చర్చి నుంచి బ్యారేజీ సెంటర్ వరకూ శాంతి ర్యాలీ నిర్వహించారు. తలారి వరప్రసాద్, అయితాబత్తుల ప్రసాద్, రేగుళ్ల రాజు, బట్టు సునీల్, బతాణి జోషిబాయ్, దేవదాసి శ్రీను, రేగుళ్ల రఘు తదితరులు పాల్గొన్నారు.
- కడియం: పొట్టిలంకలోని రూపాంతర లూథరన్ దేవాలయం వద్ద శాంతియుత నిరసన తెలిపారు. రెవరెండ్ నవీన్ మాట్లాడుతూ మణిపూర్‌లో రెండు తెగల మధ్య సోదర భావం పెంపొందించేందుకు కేంద్ర ప్రభుత్వం కృషి చేయాలన్నారు. ఆర్.జోసెఫ్, నక్కా వెంకటరత్నరాజు, బడుగు సత్తిబాబు, నక్కా చంటిబాబు, నక్కా డానియల్ పాల్గొన్నారు.
- ప్రకాశం నగర్: వివిధ క్రైస్తవ సంఘాల ఆధ్వర్యంలో నగరంలో ఆదివారం ర్యాలీ నిర్వహించారు. సీఎస్ఎస్ చర్చి నుంచి ఏవీఏ రోడ్, గాంధీపురం, దేవీచౌక్ మీదుగా సబ్ కలెక్టర్ కార్యాలయం వరకూ ప్రదర్శన నిర్వహించారు. గుడాల జాన్సన్, ప్రవీణ్, పిట్టా సుమన్ పాల్గొన్నారు.

ఉత్సాహంగా హ్యాపీ స్ట్రీట్



హ్యాపీ స్ట్రీట్‌లో నగర ప్రజల సందడి

రాజమహేంద్రవరం సిటీ: స్థానిక పరమహంస యోగానంద మార్గ్‌లో ఏర్పాటు చేసిన హ్యాపీ స్ట్రీట్ ప్రతివారం ఆదివారం సందడిగా మారుతోంది. నగర పాలక సంస్థ ఆధ్వర్యంలో జేఎస్ రోడ్డులోని ఏకేసీ కాలేజీ పక్కనే దీనిని ఏర్పాటు చేసిన విషయం తెలిసిందే. ఆదివారం సాయంత్రం 6 నుంచి రాత్రి 10 గంటల వరకూ నగర వాసులు కుటుంబ సభ్యులతో ఇక్కడి వచ్చి సందడి చేస్తున్నారు. ఇక్కడ ఏర్పాటు చేసిన వివిధ ఆటల్లో పాల్గొంటున్నారు.

ఆదర్శం.. మనుచరిత్రం



సత్సంగంలో ప్రసంగిస్తున్న శతావధాని తాతా సందీప్‌శర్మ

ప్రకాశం నగర్ (రాజమహేంద్రవరం): అల్లసాని పెద్దన రచించిన మనుచరిత్ర మన దైనందిన జీవితానికి అవసరమైన ధర్మ సందేశాన్ని అందించి, ఆదర్శంగా నిలిచిందని శతావధాని తాతా సందీప్ శర్మ అన్నారు. స్థానిక వీరభద్రపురంలోని సాధు స్త్రీల మఠంలో ఆదివారం జరిగిన తత్త్వదర్శిని సత్సంగంలో ఆయన మాట్లాడారు. మనుచరిత్రలోని ప్రవరుని పాత్ర ద్వారా ఆదర్శ గృహస్తు ఏవిధంగా ఉండాలో అర్థమవుతుందని అన్నారు. ప్రవరుని భార్య సోమిదమ్మ సాక్షాత్ అన్నపూర్ణ సమానురాలైన ఆదర్శ గృహిణి అని చెప్పారు. ఇందీవరాక్షుని వృత్తాంతం ద్వారా ఒక శిష్యుడు గురువు వద్ద ఎలా ప్రవర్తించకూడదో తెలుస్తుందన్నారు. మనుచరిత్రగా పేరొందిన 'స్వారోచిష మనుసంభవము' అనే ఈ కావ్యం తెలుగు పంచ మహాకావ్యాల్లో మొదటిదని చెప్పారు. పద్యానికి పట్టం కట్టిన అల్లసాని పెద్దన మనకు ఆరాధనీయుడని సందీప్ శర్మ కొనియాడారు.

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

- ఎమ్మెల్యే జక్కంపూడి రాజా
- చక్రద్వారబంధంలో అభివృద్ధి పనులకు శంకుస్థాపన



పూజలు నిర్వహిస్తున్న ఎమ్మెల్యే జక్కంపూడి రాజా

రాజానగరం: రాష్ట్ర ప్రగతి, ప్రజాసంక్షేమమే ప్రధాన లక్ష్యంగా తమ ప్రభుత్వం పాలన సాగిస్తోందని స్థానిక ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జక్కంపూడి రాజా అన్నారు. మండలంలోని చక్రద్వారబంధంలో సుమారు రూ.60 లక్షలతో నిర్మించిన కల్యాణ మండపానికి ఆదివారం నిర్వహించిన వాస్తు పూజ, హోమంలో ఆయన పాల్గొన్నారు. ఇదే ప్రాంగణంలో వేంకటేశ్వరస్వామి ఆలయ నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. గ్రామంలోని ఎస్సీ కాలనీ, అరుంధతిపేటలలో రూ.10 లక్షలతో నిర్మించే రెండు కమ్యూనిటీ భవనాలకు శంకుస్థాపనలు చేశారు.

అదనపు నిధుల కేటాయింపు

ఎమ్మెల్యే జక్కంపూడి రాజా మాట్లాడుతూ గత ప్రభుత్వంలో నిర్మాణం చేపట్టిన ఈ కల్యాణ మండప నిర్మాణ పనులు అసంపూర్తిగా నిలిచిపోయాయన్నారు. తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత అదనంగా రూ.40 లక్షలు కేటాయించి, సర్వాంగ సుందరంగా నిర్మాణ పనులు పూర్తి చేయించామన్నారు. పక్కనే ఖాళీ ప్రాంగణంలో వేంకటేశ్వరస్వామి ఆలయంతో పాటు భోజనశాలను కూడా నిర్మిస్తే బాగుంటుందని సూచించారు. ఇందుకు దాతలు ఎవరైనా ముందుకు వస్తే ప్రభుత్వం నుంచి కూడా తగిన విధంగా సాయాన్ని అందించేందుకు కృషి చేస్తానన్నారు. సొంతింటి కలను సాకారం చేస్తూ ప్రభుత్వం అందిస్తున్న నివాస స్థలాలను మిగిలిపోయిన లబ్ధిదారులకు సొంత గ్రామ పరిధిలోనే అందించేందుకు కృషి చేస్తున్నామన్నారు. ప్రజలకు ఏ సమస్యలు ఎదురైనా సత్వరమే పరిష్కరించే దిశగా చర్యలు తీసుకుంటున్నామని ఎమ్మెల్యే తెలిపారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు వాసంశెట్టి పెదవెంకన్న, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ దూలం పెద్ద, కో కన్వీనర్ గండి నానిబాబు, మాజీ కన్వీనర్ మండారపు వీర్రాజు, నాయకులు గంగిశెట్టి సోమేశ్వర్రావు, అనదాస సాయిరామ్, మార్గాని శ్రీను, వాద్రేవు శ్రీనివాసరావు, కామేశ్వర్రావు, నాగవరపు త్రిమూర్తులు, వేమగిరి కృష్ణ, తాతబ్బాయి, ఎంవి కృష్ణ ప్రసాద్, నాగ మునేశ్వర్రావు పాల్గొన్నారు.

ఘనంగా ఆర్కెస్ట్రా వార్షికోత్సవం



డాక్టర్ వంక బాలకృష్ణ దంపతులను సత్కరిస్తున్న జిత్‌మోహన్‌మిత్ర తదితరులు

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): స్థానిక జిత్‌మోహన్‌మిత్ర కళావేదికపై ఆదివారం జిత్‌మోహన్ మిత్ర ఆర్కెస్ట్రా 53వ వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. నటుడు, గాయకుడు, ఆర్కెస్ట్రా పితామహుడు శ్రీపాద జిత్‌మోహన్‌మిత్ర ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి దొండపాటి సత్యంబాబు అధ్యక్షత వహించారు. ముద్రగడ ఏసుబాబు జ్యోతి ప్రజ్వలన చేశారు. ముఖ్య అతిథులుగా ప్రముఖ వైద్యులు, గాయకుడు డాక్టర్ కంటే వీరన్న చౌదరి, డీవీవీఎస్ నారాయణ, సూరపురెడ్డి తాతారావు, పీవీఎస్ కృష్ణారావు, దేశినీడి బలరాం నాయుడు హాజరయ్యారు. వ్యాఖ్యాతగా నూజిళ్ల సూరిబాబు వ్యవహరించారు. ఈ సందర్భంగా గాయకుడు, డాక్టర్ వంక బాలకృష్ణకు గాన గంధర్వ ఎస్పీ బాల సుబ్రమణ్యం పురస్కారాన్ని జిత్ మోహన్ మిత్ర బృందం తరఫున అందజేశారు. గాయకులు పలు పాటలను ఆలపించారు.

శాటిలైట్‌సిటీలో 'మహాశక్తి'

రాజమహేంద్రవరం రూరల్: శాటిలైట్ సిటీలో ఆదివారం ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరి అధ్యక్షతన మహాశక్తి కార్యక్రమం నిర్వహించారు. టీడీపీ నియోజకవర్గ పరిశీలకులు అంగర రామ్మోహన్, రాష్ట్ర మహిళా ప్రతినిధులు మజ్జి పద్మ, కొయ్యన కుమారి, పిల్లా తనూజ, పలివెల లలిత తదితరులు మహాశక్తి పథకాలను మహిళలకు వివరించారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు మత్సేటి ప్రసాద్, కడియం ఎంపీపీ వెలుగుబంటిప్రసాద్, గ్రామ అధ్యక్షుడు దారా అన్నవరం పాల్గొన్నారు. అలాగే శాటిలైట్ సిటీలో గ్రామ టీడీపీ కార్యాలయాన్ని ఎమ్మెల్యే బుచ్చయ్య చౌదరి, నియోజకవర్గ పరిశీలకులు అంగర రామ్మోహనరావు ప్రారంభించారు.

జూనియర్ కళాశాల ఏర్పాటు చేయాలి

రాజానగరం: రాజానగరంలో ప్రభుత్వ జూనియర్ కళాశాలను ఏర్పాటు చేయాలని పీడీఎస్‌యూ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి ఎస్.కిరణ్ కుమార్ విజ్ఞప్తి చేశారు. గతంలో ఎప్పుడో ఒక కోఆపరేటివ్ కళాశాలను మంజూరు చేశారనే సాకుతో ప్రభుత్వం జూనియర్ కళాశాలను మంజూరు చేయకపోవడం పేద విద్యార్థుల పాలిట శాపంగా మారిందన్నారు. గతంలో మంజూరు చేసిన కోఆపరేటివ్ కళాశాల ఎక్కడ ఉందో కూడా తెలియదన్నారు. ఆ కళాశాల వలన పేద విద్యార్థులకు ఎటువంటి ప్రయోజనం చేకూరడం లేదన్నారు. కనుక ఈ విషయాన్ని లోతుగా పరిశీలించి, పేద విద్యార్థులకు మేలు చేకూర్చేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ మేరకు ఆర్‌జేడీ శారదకు వినతిపత్రం అందజేశామని ఆయన తెలిపారు.

